క్లుప్తంగా

గృహ నిర్మాణాల లక్ష్యాలు పూర్తిచేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

చినగంజాం: గృహ నిర్మాణాల లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేసి నివేదికను అందజేయాలని ఎంపీడీఓ కే స్వరూపరాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. సచివాలయాల పరిధిలోని గృహ నిర్మాణాలు ఉన్న స్థితి నుంచి ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, సిబ్బంది సత్వరం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ఏపీఆర్ డీ దాసు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

చినగంజాం: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడు శాశ్వతంగా వారు విద్యార్థులకు గుర్తుంటారని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం దేవదత్తం అన్నారు. సోమవారం పెదగంజాం ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముగ్గురు ఆంగ్ల ఉపాధ్యాయులు చెన్నుపాటి మంజుల, సీహెచ్ పద్మకుమారి, ఎస్‌వీ సుబ్బారెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు బీ శ్రీనివాసరావు, రికార్డు అసిస్టెంట్ టీ కిషోర్‌బాబులను సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అదే విధంగా పాఠశాలకు కొత్తగా వచ్చిన ముగ్గురు ఆంగ్ల ఉపాధ్యాయులు రవిచంద్ర, రాజశేఖర్, వినయ్‌కుమార్, పీడీ అనిల్ కుమార్, రికార్డ్ అసిస్టెంట్ కుమార్‌లను ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ వీ ఉదయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు



దుకాణాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సుబ్బారెడ్డి

అద్దంకి: బియ్యం, కందిపప్పు ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పును ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో పట్టణంలోని భవానీ సెంటర్‌లో సేల్స్ కౌంటర్‌ను తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భవానీ సెంటర్ పరమేశ్వరరెడ్డి దుకాణంలో బియ్యం, కందిపప్పు విక్రయాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ దుకాణంలో సూపర్ ఫైన్ రకం బియ్యం కిలో రూ.48, సెమీ ఫైన్ రూ.44. మూడో రకం రూ.34 లకు, కిలో కందిపప్పు రూ.132 విక్రయించనున్నట్లు తెలిపారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారి సహకారంతో ఈ దుకాణాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ మంబర్లు, ఆర్‌ఐ శంకర్ పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

యద్దనపూడి: పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోని రైతులను గుర్తించి ఈనెల 25వ తేదీలోపు చేయించేలా సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని పర్చూరు ఏడీఏ మోహన్‌రావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వీఏఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈ కేవైసీ నమోదుతో పాటు ఈ-క్రాప్ నమోదు కూడా చేయించుకునేలా రైతులకు వివరించాలన్నారు. దీని వల్ల రైతుభరోసా, సున్నావడ్డీ, పంటనష్ట పరిహారం, ఉచిత పంటల బీమా వంటి సౌకర్యాలు పొందవచ్చనే విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. వీఆర్వో, ఆర్బీకే సిబ్బంది సమష్టిగా క్షేత్రస్థాయిలో పంటపరిశీలన చేసి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చల్లగుండ్ల ఆదినారాయణ, వీఏఏలు పాల్గొన్నారు.

పథకాలు అందేలా చూడాలి

చీరాల టౌన్: ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా గ్రామస్థాయి అధికారులు విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. సోమవారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాలను ఎంపీడీవో తనిఖీ చేసి పెండింగ్ అర్జీలను విచారించారు.

వలంటీర్ అన్నయ్య వల్లే నాకు పింఛన్..

నా పేరు యాదల వరుణ్ సంజయ్. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూలో 8వ తరగతి చదువుతున్నాను. వలంటీర్ అన్న శ్రీనివాసరావు ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ ఇస్తుంటాడు. ఇంటివద్ద లేకపోతే స్కూల్‌కు వచ్చి మరి పింఛన్ అందిస్తాడు. నాకు దివ్యాంగుల పింఛన్ వస్తుంది. పింఛన్ మంజూరు చేయించింది కూడా వలంటీర్ అన్నయ్యే. ఒకప్పుడు స్కూల్‌కు సెలవు పెట్టి పంచాయతీ ఆఫీసు వద్దకు వెళ్లి అక్కడ సాయం కాలం వరకు ఉంటే కానీ పింఛను ఇచ్చే వాళ్లు కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అన్ని పనులు వెంటనే జరిగిపోతున్నాయి.



సంజయ్‌కి పింఛన్ ఇస్తున్న వలంటీర్ శ్రీనివాసరావు (ఫైల్)

ఇంటికే వచ్చి పింఛను ఇస్తున్నారు..

నా పేరు కోంర్రు వెంకాయమ్మ. వృద్ధాప్యంలో ఎటువంటి పనులు చేసుకోలేక పోతున్నాను. అయితే గతంలో నాకు ఎటువంటి పింఛను ఇచ్చే వాళ్లు కాదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత పింఛను వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుణ్యమా అని ప్రతి నెలా 1న వలంటీర్ నా ఇంటికి ఉదయాన్నే వచ్చి పెన్షన్ అందజేస్తున్నాడు. నిజంగా వలంటీర్ల సేవలు మరులేనివి.



వలంటీర్ వద్ద పింఛన్ నగదు తీసుకుంటున్న వెంకాయమ్మ (ఫైల్)

పథకాలు అందించి.. మనసులు గెలిచి

వలంటీర్లకు వందనం

చీరాల టౌన్/వేటపాలెం:

గతంలో ఒక చిన్న పనికోసం రోజుల తరబడి తిరిగినా సమస్యలు పరిష్కారం అయ్యేవి కావు. రేపురా.. ఎల్లుండి రా.. లేకపోతే వచ్చే వారం రా.. నీపని అయిపోతుందని అధికారులు తిరిగ్గా సమాధానం చెప్పిన రోజులు చాలా ఉన్నాయి. వీటన్నింటికి చెక్ పెడుతూ వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పాలను ఇంటికి వద్దకే చేర్చాడు. పార్టీలకు అతీతంగా అర్హులైతే చాలు వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే చెందుతుంది. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన అందించిన సేవలు అమూల్యమైనవి. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్నారు వలంటీర్లు.

వలంటీర్ వలనే సంక్షేమ పథకాలు..

మాది చీరాల మండలంలోని ఈపురుపాలెం పంచాయతీ. నేను చేనేత కార్మికుడిని నాకు గతంలో ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా మా ఇంటికే వచ్చి చేరుతున్నాయి. గత ప్రభుత్వంలో అరకొరగా అందిన పథకాలు నేడు వలంటీర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పింఛన్, చేయూత, నేతన్న నేస్తం తదితర పథకాలు క్రమం తప్పకుండా మాకు చేరుతున్నాయి.



చేనేత కార్మికుడు ముట్టే గోపాలం

ఒక్క రోజులోనే రైస్ కార్డు మంజూరు..

నా పేరు బి.సుబ్బాయమ్మ. మాది చీరాల మండలంలోని బోయినవారిపాలెం గ్రామం. నా భర్త గతంలో కాలం చేశాడు. అప్పటి నుంచి రైస్ కార్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాను. ప్రభుత్వం అందించే పథకం పొందాలన్నా రైస్ కార్డు తప్పనిసరి. అది లేకపోవడంతో మా వలంటీర్ ద్వారా దరఖాస్తు చేయించగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాకు ఒక్క రోజులోనే మంజూరు చేశారు. రాజకీయ లబ్ధికోసం వలంటీర్లను దుర్భాషలాడటం దుర్మార్గం.



పింఛన్ అందుకుంటున్న సుబ్బాయమ్మ

స్పందన అర్జీల విచారణలో అలసత్వం వద్దు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సురేష్, ఆర్‌ఐ శేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

కారంచేడు: ప్రతి సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో వచ్చే అర్జీల పరిష్కారంలో సంబంధిత సిబ్బంది కృషి చేయాలని తహసీల్దారు ఎస్ వెంకటరత్నం అన్నారు. సోమవారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన, వీఆర్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీటీ పీ సుశీల, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా దివ్యాంగ విద్యార్థుల సర్వే



దివ్యాంగ విద్యార్థితో ఎంఈవో దినేశ్ కుమార్

సంతమాగులూరు (అద్దంకి): పకడ్బందీగా దివ్యాంగ విద్యార్థుల సర్వే నిర్వహించాలని ఎంఈవో-2 దినేశ్ కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో సోమవారం దివ్యాంగుల సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేశ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు సర్వే ఉంటుందన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి గ్రామంలోని వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు. సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. యాప్‌లో మండలంలోని ప్రతి ఒక్క హైస్కూల్, యూపీ, ఎలిమెంటరీ, పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ యాప్‌ను డౌన్ లోడ్ చేయించుకుని, రిజిస్టర్ అయి బడిలోని దివ్యాంగ విద్యార్థులను ఈ-ప్రశాంత్ యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు.

జగన్‌ను ఎదుర్కోలేక అసత్య ప్రచారాలు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

పర్చూరు (చినగంజాం): జగన్‌ను ఎదుర్కోలేక ప్రతిపక్ష పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ టీడీపీ, జనసేన నాయకులను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మండలంలోని కొత్తపాలెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఉన్న జన్మభూమి కమిటీలకు చట్టబద్ధత లేదన్నారు. ఎక్కడో ఒక వలంటీర్ తప్పు చేస్తే దానిని అందరికీ ఆపాదించడం సరికాదన్నారు. వలంటీర్ వ్యవస్థ కంటే ఇంకా మెరుగైన వ్యవస్థను తీసుకురాగలరా అన్న ప్రతిపక్షాలకు ఆయన సూటిగా ప్రశ్నించారు. వలంటీర్‌లపై అసత్య ప్రచారాలు చేసి ప్రజల దృష్టిని మరల్చాలని చూస్తున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మళ్లీ ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. వలంటీర్ లాంటి వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదని కొనియాడారు. అనంతరం 620 మంది లబ్ధిదారులకు కౌలు రైతు గుర్తింపు కార్డు, రైస్‌కార్డు, కుల, ఆదాయం తదితర సర్టిఫికెట్లు అందించారు. అనంతరం గ్రామానికి సంబంధించిన పలురకాల సమస్యలపై ఆయన స్పందించారు. అర్జీలు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నూతలపాడులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రద్యుమ్న కుమార్, సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్యలు పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందించారు. కొత్తపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డీఎం అండ్ హెచ్ఓ విజయమ్మ, తహసీల్దార్ కే సంధ్యశ్రీ, ఈఓఆర్డీ గౌస్, వైస్ ఎంపీపీ వీరయ్య, కొత్తపాలెం సర్పంచ్ పాలపర్తి సంపూర్ణమ్మ, చెరుకూరు సర్పంచ్ సుబ్బారావు, ఈఓ సత్యనారాయణ, నాయకులు నాగేశ్వరరెడ్డి, దాసి నరసింహరావు, కొల్లా రామకృష్ణ, కల్లం సుబ్బారెడ్డి, పాలపర్తి శివారెడ్డి, భూషిరెడ్డి, కోసం వెంకటరెడ్డి, దశరథరామిరెడ్డి, ఆకుల హేమంత్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు సంక్షేమ పథకాలు

● సర్టిఫికెట్లు పంపిణీ చేసిన శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



కొప్పరపాలెంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ చైతన్య

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అర్హులకు వివిధ పథకాలు అందించేందుకు ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో గ్రామాల్లోని సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం మండలంలోని కొప్పరపాలెం, వైదన గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలో 1429 మందికి వివిధ రకాల ధ్రువత్రాలను అందజేశారు. సాంకేతిక లోపాలతో సంక్షేమ పథకాలకు అర్హులు కాని వారు జగనన్న సురక్షలో సరైన సర్టిఫికెట్లు పొందాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో తలపెట్టని కార్యక్రమాన్ని జగనన్న చేపట్టారన్నారు. కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్, బాపట్ల రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు వీ అమల, మేడా జయలక్ష్మీ, తహసీల్దర్ కె. రవిబాబు, ఈవోఆర్డీ సుమతి, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, డీటీ రవికుమార్, ప్రత్యేకాధికారులు శ్రీనివాసరావు, కల్పన, అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అద్దంకి పట్టణంలోని సంజీవనగర్ సచివాలయం వద్ద, సంతమాగులూరు మండలంలోని కొప్పరం, ఏల్చూరు-3 సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణచైతన్య సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సంతమాగులూరు మండల అధికారులు, స్థానిక నేతలు, అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్‌చైర్మన్ పద్మేష్, అనంతలక్ష్మీ, వార్డు కౌన్సిలర్‌లు, స్థానిక నేతలు గూడా శ్రీనివాసరెడ్డి, కాకాని రాధకృష్ణమూర్తి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే నేరుగా సేవలు



మార్టూరులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు



వేటపాలెం: విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీడీవో నేతాజీ

వేటపాలెం: జగనన్న సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వివిధ రకాలైన సేవలు నేరుగా అందుతున్నాయని ఎంపీడీవో కే నేతాజీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వేటపాలెం సచివాలయం-2, రామన్నపేట సచివాలయం-2లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు నేరుగా ఎటువంటి ఆలస్యం లేకుండా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటుదన్నారు. వేటపాలెం సచివాలయం-2లో 672, రామన్నపేట సచివాలయం-2 లో 614 మందికి వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీ కృష్ణకిషోర్, తహశీల్దార్ అశోక్‌వర్ధన్, ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, సురేంద్ర, అందె కృష్ణ, మాజీ సర్పంచ్ మున్నంగి అరుణ్ కుమార్, కట్టా శ్యామేలు, మాథ్యూస్, పాల్గొన్నారు.

లబ్ధిదారులకు 1455 సర్టిఫికెట్లు పంపిణీ..

మార్టూరు: మార్టూరులో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్జీదారులకు 1455 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మార్టూరు సచివాలయం-2,4 పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయం-2లో 651, సచివాలయం-4లో 804, మొత్తం 1455 గ్రామస్తులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీడీఓ కే కృష్ణకుమారి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ సుబ్బారావు, సర్పంచ్ భూక్యా సునీతా బాయి, ఎంపీపీ భూక్యా శాంతిబాయి, ఉప సర్పంచ్ కాకోలు రామారావు, సచివాలయ కార్యదర్శి మీరావలి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యద్దనపూడి: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సూరవరపుపల్లి మెయిన్‌సెంటర్‌లో టీచర్‌పోస్టుకు, గన్నవరం, చిలుకూరివారిపాలెం గ్రామాల్లో ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తకు 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. సదరు పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారు గ్రామ పరిధిలో నివాసం ఉండాలని, 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తమ దరఖాస్తుతో పాటు విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 22 వతేదీ లోపు పర్చూరు ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్చూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి ముఖద్వారం వద్ద ఉన్న రోగులను ఆయన ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు



భూములు పరిశీలిస్తున్న సర్వేయర్, బీట్ ఆఫీసర్

బల్లికురవ: అటవీ శాఖకు సంబంధించిన భూములను ఆక్రమించినా, గ్రావెల్ తరలించినా చర్యలు తప్పవని కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ అధికారి కే రమేష్ హెచ్చరించారు. సోమవారం గొర్రెపాడు రిజర్వు ఫారెస్ట్ కొండ భూములను సర్వేయర్‌తో కలిసి పరిశీలించారు. మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి ముక్తేశ్వరం ఉప్పమాగులూరు గ్రామాల్లో 1393 హెక్టారుల్లో ఫారెస్ట్ భూములు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న భూహక్కు, భూరక్షలో భాగంగా తమ ఫారెస్ట్ భూముల్లో కూడా హద్దు రాళ్ల ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు విన్నవించినట్లు చెప్పారు. పరిశీలనలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఏ శ్రీనివాసరావు, సర్వేయర్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

పర్చూరు (చినగంజాం): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పర్చూరు ఎస్సై ఎస్ చెంచు ప్రసాద్ అన్నారు. సోమవారం పర్చూరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతను గురించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ కలిగి ఉండాలని, హెల్మెట్ వాహనానికి అలంకరణగా తగిలించకుండా తలకు పెట్టుకొని ప్రాణాలను రక్షించుకునేందుకు పెట్టు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై ప్రసాద్

ఆలయ భూముల కౌలు వేలం వాయిదా

తిమిడెదపాడు (కారంచేడు): మండలంలోని తిమిడెదపాడు గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థాన ఆలయ భూముల కౌలు వేలం వాయిదా పడింది. సోమవారం కౌలు వేలం నిర్వహించడానికి మండల దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి దర్శి జ్యోతికుమారి సిబ్బందితో కలసి గ్రామంలోని దేవాలయం వద్దకు వచ్చారు. అయితే గ్రామంలోని దేశదాయ భూముల కౌలులో కొన్ని అడ్డంకులతో కోర్టులో ఉన్నందున వాటిని నిలుపుదల చేయాలని రైతులు కోరారు. దీంతో కార్యనిర్వహణాధికారి ఉన్నతాధికారుల సూచనతో వాయిదా వేసినట్లు తెలిపారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి

● ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల: నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరిగా ఉండాలని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. కుందేరు అభివృద్ధి, పూడికతీత పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అలానే పట్టణంలోని ఎన్‌ఆర్‌పీఎం హైస్కూల్‌లో రూ. 1.50 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న జిమ్, పాపరాజు తోటలోని పీహెచ్ ట్యాంక్ వద్ద నిర్మిస్తున్న సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. అలానే పట్టణంలోని 23వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ ఏసయ్య, ఏఈ రవి, అప్పల శ్రీనివాసరావు, ఈసర్ల బుజ్జి, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, కంపా అరుణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే



మహిళకు అందిన పథకాల గురించి వివరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

● ఏపీ శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: నవరత్నాల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. సోమవారం మండలంలో రామాయపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించారు. అనంతరం లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత దేశంలో మన సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మన రాష్ట్రంలోని పాలన ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. జగనన్న పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కలిసి కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నాయని విమర్శించారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ ప్రజలను వంచన చేసిందన్నారు. ఇక జనసేన అధినేత పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. వలంటీర్ల రాకతో ప్రతి పథకం లబ్ధిదారుల గడప వద్దకే అందుతున్నాయని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు అండగా ఉండి మరలా సీఎంను చేయాలని లబ్ధిదారులను చైతన్య కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఎంపీపీ అవిశెన జ్యోతి, సర్పంచ్ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ ఉప్పులూరి సాంబిరెడ్డి, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.